

భూ కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

● పోలీసు చర్యలతో దిగివస్తున్న అక్రమార్కులు ● బాధితులతో బేరసారాలు

కరీంనగర్ క్రైం, జనవరి 19 : జిల్లాలో భూకబ్జాలు, దౌర్జన్యాలు, డబ్బుల వసూళ్లు తదితర అక్రమ దందాలు నిర్వహించిన వారిపై బాధితుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. భూకబ్జాలకు సంబంధించినవారు ఎవరైనా ఫిర్యాదులు అందిస్తే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రకటనకు బాధితుల నుంచి స్పందన వెల్లువెత్తుతున్నది. సీపీ చెప్పిన విధంగానే అన్యాయం జరిగిన ఘటనల్లో నిందితులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించటంతో బాధితులకు భరోసా లభించినట్లయింది.

ఇంత కాలం బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని భావిస్తున్న బాధితులు నేరుగా సీపీ కార్యాలయానికి వెళ్లి జరిగిన అన్యాయం గురించి పూర్తి సమాచారంతో పాటు ఆధారాలను సమర్పిస్తున్నారు. శుక్రవారం కూడా భూఅక్రమాలకు సంబంధించి 10 మందికిపైగా బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. బొమ్మకల్ సర్పంచ్, కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై అదే గ్రామానికి చెందిన 8 మంది శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను కలిసి బొమ్మకల్ గ్రామంలో పలు భూ అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కూడా సర్పంచ్ తన బినామీలు, అనుచరులతో కబ్జా చేయించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపాలని ఇద్దరు ఏసీపీలకు అప్పగించారు.

అలాగే రేకుర్తి కార్పొరేటర్ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించి విక్ర యించాడని, కరీంనగర్‌కు చెందిన ఒక రియల్‌ఎస్టేట్ వ్యాపారి తప్పుడు డాక్యుమెంట్లతో స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి, డబ్బులు తీసుకుని స్థలాలు ఇవ్వకుండా మోసాలకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. వీటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నారు. భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులపై తీగలగుట్టపల్లిలో శుక్ర వారం ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్‌కు చెందిన ఏసీపీ విచారణ జరిపారు. మరో ఫిర్యాదుపై కరీంగర్ రూరల్ ఏసీపీ విచారణ చేస్తున్నట్లు సమాచారం.

అక్రమార్కుల రాజీ ప్రయత్నాలు

గతంలో ఇంటిస్థలాలు కబ్జాలకు పాల్పడినవారు, ఇంటి అనుమతుల కోసం ఇబ్బందిపెట్టి డబ్బులు దండుకున్నవారు, డబుల్ రిజిస్ట్రేషన్లు చేసినవారు కొందరు బాధితుల వద్దకు దూతలను పంపించి కాళ్లబేరానికి వస్తున్నట్లు తెలుస్తోంది. పోలీస్ కమిషనర్ భూకబ్జా, దౌర్జన్యాలకు పాల్పడిన కేసులో ఒక కార్పొరేటర్‌తో సహా ఒక నాయకుడిని కటకటా ల్లోకి నెట్టగా, మరొక కార్పొరేటర్ చేసిన దౌర్జన్యాలు, కూల్చివేతలపై సీపీకి ఫిర్యాదులు చేయటం, సీపీ కఠినంగా వ్యవహరిస్తున్న కారణంగా అక్రమార్కులు భయాందోళనకు గురవుతున్నారు.

ఈ సమయంలో వారు గాడ్‌ఫాదర్‌గా భావించిన బడా నాయకులు కూడా సీపీ కఠినవైఖరితో ఏమీ చేయలేని స్థితి నెలకొనడంతో అక్రమార్కుల్లో ఒక రకమైన భయం పట్టుకుంది. నేడో రేపో తాము కూడా కటకటాల్లోకి వెళ్లాల్సి వస్తుందనే వణుకుతో బాధితులతో రాజీ కోసం మంతనాలు జరుపుతున్నట్లు, బాండ్‌పేపర్లు రాసి ఇస్తున్నట్లు సమాచారం. ఇందుకు ఉదాహరణగా అల్కాపూర్ కాలనీలో 2012 సంవత్సరంలో ఇద్దరు రియల్టర్‌లు వెంచర్ ద్వారా 409 గజాల ఇంటిస్థలం జమ్మికుంటకు చెందిన ఒక వ్యక్తికి విక్రయించారు. అప్పటి నుంచి అతని ఆధీనంలో ఉన్న ప్లాట్‌ను హద్దులు మార్చి 2023లో ఆ రియల్టర్‌లు మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారు.

తాజాగా 10 రోజుల కిందట అదే ఇంటి స్థలాన్ని వేరొకరికి విక్రయించేందుకు సిద్ధమై చదును చేయటంతో మొదట కొనుగోలు చేసిన యజమానికి తెలిసి రియల్టర్లను ప్రశ్నించి, సీపీకి ఫిర్యాదు చేస్తానని చెప్పటంతో ఆ రియల్టర్లు రాజీకి వచ్చినట్లు బాధితుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. విద్యానగర్‌కు చెందిన ఒక బాధితుడికి చెందిన రెండు ప్లాట్‌లను కబ్జా చేసి, కేవలం 20 శాతం డబ్బులు చేతిలోపెట్టి ఇంటికి పంపించారు. దీనిపై రెండు రోజుల కిందట ఆ కబ్జా దారులను బాధితుడు ప్రశ్నించగా రాజీకి వచ్చినట్లు తెలిసింది. ఇలా చాలా మంది భూకబ్జా డబుల్ రిజిస్ట్రేషన్, ఫేక్ డాక్యుమెంట్లతో మోసాలకు పాల్పడిన వారు కేసుల భయంతో రాజీకి వస్తున్నట్లు తెలుస్తోంది.

కార్పొరేటర్ రాములును పరామర్శించిన ఎమ్మెల్యే గంగుల :

ఇంటి స్థలం కబ్జాకు సంబంధించిన కేసులో అరెస్టు అయి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు శుక్రవారం పరామర్శించారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో జైలుకు వెళ్లి ఇద్దరిని కలిసి కేసు పూర్వాపరాలు, అనంతర పరిణామాలను అడిగి తెలుసుకుని, వారికి భరోసా కల్పించినట్లు తెలిసింది. జైలు ములాఖత్ ద్వారా తోట రాములు, చీటిరామారావులను కొంత మంది కార్పొ రేటర్లు, వారి కుటుంబ సభ్యులు కూడా పరామర్శించారు.


అన్నారంలో దెబ్బతిన్న ఎస్సారెస్పీ ఉపకాలువ

అధ్వానంగా ఎస్సారెస్పీ ఉపకాల్వలు

మరమ్మతులు చేయాలంటున్న రైతులు

మానకొండూర్, జనవరి 19: ఎల్ఎండీ రిజర్వాయర్ నుంచి మండలంలోని డీబీఎం 2 నుంచి డీ బీఎం 7 ఉపకాల్వల ద్వారా పలు గ్రామాల్లోని పొలాలకు సాగునీరు సరఫరా అవుతుంది. డీబీఎం 6 ఉప కాల్వ ద్వారా మండలంలోని దేవంపల్లి నుంచి జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఈ ఉపకాల్వలలో చెత్తా చెదారం నిండిపోవడమే కాకుండా పిచ్చి మొక్కలు మొలిచింది. దీంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. ఉపకాల్వల లైనింగ్ చెడిపోయి నీరంతా వృధాగా పోతుంది. ప్రస్తుతం యాసంగి పంటకు మార్చి 31 వరకు వారబందీ పద్ధతి ద్వారా సాగు నీరు సరఫరా చేస్తామని అధికారులు ఇప్పటికే తెలిపారు. ఉప కాల్వల్లోని చెత్తా, చెదారం, పిచ్చ మొక్కలు తొలగించి చెడిపోయిన లైనింగ్ మరమ్మతులు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

డీఈవో జనార్దన్‌రావు


మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

మానకొండూర్, జనవరి 19: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని డీఈవో జనార్ధన్‌రావు అన్నారు. మానకొండూర్‌లోని బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. బాలికలు పోషకాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. విద్యపై దృష్టి సారించి ఉత్తములుగా తయారు కావాలనిన్నారు. ఇంటర్‌నెట్ వలన కలిగే దుష్ఫలితాలు, బాల్యవివాహాలు, లింగవివక్షత, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించా రు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యులు గోపాల్, ఏఎస్‌ఐ భాస్కరాచారి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

దైవ కార్యాన్ని రాజకీయం చేయవద్దు


ఆలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎంపీ బండి సంజయ్

● ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలి
● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
● ఇల్లందకుంట రామాలయం పరిసరాలు శుద్ధి

ఇల్లందకుంట, జనవరి 19: ఈ నెల 22న అయోధ్యలో జరగబోయే రామమందిర పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని రాజకీయం చేయవద్దని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎంపీ సంజయ్‌ని శాలువాతో సన్మానించి, స్వామివారి చిత్ర పటాన్ని బహూకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో కలిసి ఆలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని ఊడ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు దేవాలయాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

అందులో భాగంగా ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం పరిసరాలను శుద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. అయోధ్యలో ఈ నెల 22న జరగబోయే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తుందన్నారు. తెలంగాణ ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు సిద్ధమైన నేపథ్యంలో 22న సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రామ మందిర నిర్మాణ నిధుల సేకరణలో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. అయోధ్య రాముని అక్షింతలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను మీడియా ప్రస్తావించగా అక్షింతల్లో రేషన్ బియ్యం, బాసుమతి బియ్యం, జైశ్రీరాం బియ్యం అనే రకాలు ఉండవని అన్నారు. పవిత్రమైన దేవుడి అక్షింతలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారని, వారు కోరితే బాసుమతి బియ్యాన్ని పంపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, సర్పంచ్ శ్రీలత- సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న- శ్రీనివాస్, నాయకులు ప్రవీణ్, ఆకుల రాజేందర్, జీడీ మల్లేష్, చెన్నమాధవుని నర్సింహరాజు, శీలం శ్రీనివాస్, షఫీ, సంపత్‌రావు, రవి, కోలకాని రవి పాల్గొన్నారు.


బండి సంజయ్‌కుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

అంతా రామమయం



● జిల్లాలో అయోధ్య రామాలయ ప్రతిష్ఠ సందడి
● వినూత్న కార్యక్రమాలకు భక్తుల ఏర్పాట్లు
● 22న ఆలయాల్లో పారాయణాలు.. భజనలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19: 'అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం' అన్నట్లుగా ఏ నోట విన్నా అయోధ్య రాముడి ప్రతిష్ఠ మహోత్స వాలపై చర్చ జరుగుతోంది. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరంలో రాముడి ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని హిందూ సమాజం విభిన్న కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. వీహెచ్‌పీ, భజరంగదళ్, పలు సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జిల్లా అంతటా పలు కూడళ్లలో విభిన్న రూపాల్లో రాముని భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిష్ఠ తేదీ మరో రెండు రోజులు మాత్రమే ఉండగా ఎక్కడ చూసినా భక్తిపూరిత వాతావరణం నెలకొంటున్నది. ఎవరి నోట విన్నా ప్రతిష్ఠ విషయాలే చర్చకు వస్తున్నాయి.

ఆలయాలు, అపార్టుమెంట్‌లు, వీధుల్లో భారీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి ప్రతిష్ఠ ప్రత్యక్ష కార్యక్రమాలను జనం వీక్షించనున్నారు. ఆలయాల శుద్ధి చేపట్టగా ప్రత్యేకంగా రామ కల్యాణాలు, అభిషేకాలు, పూజలు, పారాయణాలు, భజనలు జరుపనున్నారు. గత 15 రోజుల నుంచి అయోధ్య నుంచి వచ్చిన అక్షతల వితరణ కొనసాగుతూనే ఉంది. మరోవైపు పత్రికలు, టీవీలతో పాటు సామాజిక ప్రసారమాధ్యమాల్లో ప్రచారం జోరుగా కొనసాగుతోంది. రామజన్మభూమిక్షేత్రతీర్థ ట్రస్టు నుంచి వచ్చిన అక్షితలను రామ భక్తులు ఇంటింటా పంచుతున్నారు. దేశం నలుమూలల నుంచి రామ భక్తులు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. చేతులతో నడవడం, మౌన వ్రతాలు చేపట్టడం, బండ్లు కట్టుకొని ప్రయాణ మవడం, ఆభరణాలు, చీరలు, వస్త్రాలు, ప్రతిష్ఠా సంబంధ వస్తువులు, ప్రసాదాలు పంపుతున్నారు. కొందరు ప్రత్యక్షంగా వాటిని అందజేసేందుకు అయోధ్యకు ఇప్పటికే తరలి వెళ్లారు. ఇంటా బయటా చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు జై శ్రీరాం.. రాజారాం.. నినాదాలు చేస్తున్నారు.

ప్రత్యేకంగా నృత్యాలు, పాటలు, పద్యాలు, ఫొటోలు, ప్రసంగాలు, ప్రవచనాలు, రామ చరిత్రతో కూడిన వీడియోలను రూపొందించి అందరితో పంచుకుంటున్నారు. తాము 22న ఆయా ప్రాంతాల్లో చేసే కార్యక్రమాల గురించి ప్రచారం చేస్తున్నారు. ప్రతిష్ఠా సమయంలో ప్రతి ఇంటిలో, ఆలయాల్లో, అన్ని చోట్లా దీపాలు వెలిగించాలని నిర్ణయించారు. కొందరు రాజకీయాలు చేసినా వాటిని పట్టించుకోవద్దని, అందరూ రామునికి, రామరాజ్యానికి స్వాగతం పలకాలని రామ భక్తులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా 22న ఆధ్యాత్మిక భావం ప్రతి వ్యక్తిలో నిండిపోనుంది. దేశమంతటికీ రాముడు లోకాభిరాముడు కానున్నాడు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

● ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ● మహిళా కార్పొరేటర్లకు ప్రత్యేక గది ఏర్పాటు


గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 19: మహిళా ప్రజాప్రతి నిధులు సమస్యల పరిష్కారంలో ముందుండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మహిళా కార్పొ రేటర్ల కోసం ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని శుక్రవారం మేయర్ యాద గిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో నగర పాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి మహిళా కార్పొ రేటర్లు తమకు ప్రత్యేక గది కేటాయిం చాలని కోరుతున్నారన్నారు. వారి కోరిక మేరకు మేయర్ సునీల్ రావు, పాలకవర్గసభ్యులు నగరపాలక సంస్థ ఆధుని కీకరణతో సౌకర్యవంతమైన గదిని మహిళా కార్పొరేటర్ల కోసం కేటాయించడం సంతోషమన్నారు. మహిళా కార్పొ రేటర్లు సమావేశాలతో పాటు నగరపాలక సంస్థకు వచ్చి ప్రజా సమస్యలపై అధికారులతో చర్చించి వాటి పరిష్కారా నికి కృషి చేయాలని సూచించారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో 50శాతానికిపైగా మహిళా కార్పొరేటర్లు ఉన్నారని, వారి కోసం ప్రత్యేక గదిని కేటాయించడం ఆనం దంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరి శంకర్ మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమ లాకర్, మేయర్ సునీల్‌రావు మహిళా కార్పొరేటర్ల కోసం ప్రత్యేక ఛాంబర్‌ను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, నాయకులు పాల్గొన్నారు.


తమకు కేటాయించిన గదిలో కూర్చొన్న మహిళా కార్పొరేటర్లు

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జనవరి 19: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓటరు ధ్రువీకరణ, ఓటరు జాబితా తయారీ వంటి పలు అంశాలపై ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఓటర్ల నమోదుకు జనవరి 1, 2024ను ప్రామాణికంగా తీసుకొని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, ఓటరు జాబితాలో మరణించిన ఓటర్ల పేర్లను తొలగించాలని అన్నారు. లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు.

జనవరి 6, 2024న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై ప్రజల నుంచి జనవరి 22, 2024 వరకు అభ్యంత రాలను స్వీకరించాలని అన్నారు. ఫిబ్రవరి 2లోగా అభ్యంతరాలను, ఓటరు క్లెయిమ్స్‌ను పూర్తిస్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. 18 సంవత్సరాలు నిండి నూతనంగా ఓటు హక్కు పొందుతున్న వారి జాబితా, వివిధ వయస్సులోగల వారి జాబితాను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని సూచించారు. 1450 కంటే ఎక్కువ ఓటర్లు లేకుండా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా, చిరునామా, ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వారీగా చేపట్టిన సమా చారాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. జనవరి 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందు బాటులో ఉండి, ప్రజలు, ఓటర్ల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం : కలెక్టర్

ఈ నెల 20,21 తేదీల్లో రెండు రోజుల పాటు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదును ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని, తప్పులు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫు ల్ దేశాయ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రాజు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను విస్తృ తంగా తనిఖీ చేస్తున్నట్లు వ్యవసా యాధికారి వైదేహి తలిపారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంతో పాటు పెర్కపల్లి, ఆకునూర్, ఎల్లంపల్లి గ్రామాలలో వ్యవసాయాధికారి వైదే హి ఎరువుల దుకాణాలు తనిఖీ చేయడంతో పాటు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతీ రోజు కొన్ని షాపులను ఎంచుకొని వాటిలో రికార్డులను పరిశీలస్తున్నామన్నారు. డీలర్లు ఎపోస్ మిషన్‌కు స్టాక్ రిజిష్టర్ గ్రౌండ్ బ్యాలన్స్ తో సరి పోతుందా లేదా అనిపరిశీలిస్తున్నామని చెప్పారు. ఎరువుల విక్రయాలు తప్పని సరిగా ఎపోస్ మిషన్ ద్వారానే చేయాలనిన్నారు. ఈ యాసంగి సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా స్టాక్ ఎప్పిటికప్పుడు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తనిఖీలలో రికార్డుల సక్రమంగా లేనట్లు తేలితే షాపుల లైసన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. షాపుల పరిశీలనతో పాటు ప్రతీ రోజు పంటలను పరిశీలస్తున్నామని వివరించారు. చీడ పీడల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి

మానకొండూర్, జనవరి 19: మానకొండూర్ గ్రామానికి చెందిన సుహన్ అనే బాలుడు శుక్రవారం పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనూష నవీన్ దంపతుల కుమారుడు సుహాన్(3) ఏళ్ల బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది.. బాలుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమంచి బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



సుహాన్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల కేంద్రంలో జీపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్కేపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్, రజినీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు సైదాపూర్ పాత బస్టాండ్ మీదుగా దుద్దెనపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన జీపు ఆ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. కింద పడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళా గురుకులంలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్

జగిత్యాలరూరల్, జనవవరి 19: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల సాంఘిక సంక్షేమ శాఖ మహిళా గురుకుల కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 20న మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించనునన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గోలి శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 టీఎస్ ఎంసెట్ (బైపీసీ)లో అర్హత సాధించినవారు అర్హులని ఆసక్తికలవారు అన్ని ధ్రువపత్రాలు ఒరిజనల్ జిరాక్స్ ప్రతులతో హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలన్నారు. వివరాలకు కళాశాలలో 8142747880లో సంప్రదించాలని కోరారు

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి

● అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, జనవరి 19: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురా సుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ. కళాభవన్లో శ్రీస్వామివారి నిత్యకళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో లఘు దర్శనం అమలు చేశారు. దీంతో భక్తులు నందీశ్వరుడి విగ్రహం వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. అనుబంద ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ధర్మపురిలో రెండో రోజు

వేద పారాయణం


వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండో రోజూ 21 మంది వేదపండితులు రుగ్వేద హవనం, సామవేద పారాయణం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు, స్థానిక వేదబ్రాహ్మణులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడ వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, ఆలయ ఉపప్రదాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ ఏజెంట్ల ఇళ్లలో సీబీఐ సోదాలు

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు


పాస్ పోర్ట్ ఏజెంట్ ఇంటి వద్ద సీబీఐ అధికారులు

కోరుట్ల, జనవరి 19: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లపై సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. కోరుట్ల పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అశోక్, ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న చాంద్ పాషా (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), రతాల పంపు ప్రాంతంలో ఉంటున్న కమర్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లలో అధికారులు సోదాలు జరిపారు. నాలుగు బృందాలుగా విడిపోయిన సీబీఐ అధికారులు ఏకకాలంలో వారి వారి ఇళ్లలో సోదా చేసి ఇంట్లో ఉన్న నకిలీ నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, వివిధ అధికారుల హోదాతో ఉన్న స్టాంప్‌లతో పాటు ల్యాప్‌టాపులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిసింది. అశోక్ రావు, కమర్‌ను అదుపులోకి తీసుకోగా చాంద్ పాషా పరారైనట్లు తెలుస్తోంది. అశోక్ రావుతో పాటు కమర్‌ను విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా చాంద్ పాషా పరారీలో ఉన్నడని ప్రచారంతో పాటు హైదరాబాదులో వారి బంధువుల శుభకార్యానికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. కొందరు గల్ఫ్ ఏజెంట్లు, ట్రావెల్స్ యజమానుల గుండెలలో రైలు పురుగులు తీయడంతో పాటు వారి కార్యాలయాలను మూసివేసుకున్నారు. సీబీఐ అధికారులు కోరుట్ల నుంచి వెళ్లిపోయ్యారన్న సమాచారంతో వారు ఉపిరి పీల్చుకున్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి, జనవరి, 19: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన ఎస్సై చిరంజీవితో కలిసి మాట్లాడారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ హైదర్, నిజామాబాద్ జిల్లా మోర్తడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్‌కు ఆరు నెలల క్రితం జైల్లో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. రెండు నెలల క్రితం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సాయిబాబ ఆలయంలోని హుండీ, 15 రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని ఎల్లమ్మ గుడిలోని హుండీ, ఇబ్రహీంపట్నంలోని గోదురులోని పోచమ్మ, హనుమాన్ ఆలయాల్లోని హుండీ పగలగొట్టి బంగారం, వెండి అభరణాలు చోరీ చేశారు. కోరుట్ల మండలంలోని ధర్మారంలోని రామాలయంలోని హుండీ పగలగొట్టి నగదు దోచుకున్నారు. మూడు రోజుల క్రితం మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్క, ఆత్మనగర్ గ్రామాల్లోని ఆలయాల్లోని బంగారం, వెండి, హుండీలను ఎత్తుకెళ్ళారు. వారిని మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో వారిని పట్టుకొని ద్విచక్ర వాహనం, 14 తులాల వెండి, రూ. 9 వేలు, తాళాలు పగల గొట్టే కొంకిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు కానిస్టేబుల్ కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించి రివార్డులను అందజేశారు.

ఆలయాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని ఆందోళన

- అధికారుల చర్చలతో సద్దుమణిగిన గొడవ


ఆందోళన చేస్తున్న తిమ్మాపూర్ గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జనవరి 19: ఆలయాలకు రహదారితో పాటు ఆలయానికి సంబంధించిన భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం తిమ్మాపూర్ గ్రామస్థులు పెద్దమ్మ ఆలయం వద్ద రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ శివారులోని గ్రామ దేవతలైన పోచమ్మతో పాటు వివిధ ఆలయాలకు వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని అక్కడకు వెళ్లేందుకు రహదారి ఇస్తానని చెప్పి ఇప్పుడు ఇవ్వకుండా వీడీసీ సభ్యులపైన పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాదాపుగా మూడు గంటల పాటు మహిళలు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ ఉమాసాగర్ అక్కడకు చేరుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో సంఘ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబ సభ్యులను పిలిపించారు. అక్కడకు చేరుకుని ఇరువురు చర్చలు జరిపారు. ఆనంతరం ఇరువు రు శాంతించి ఆలయాలకు వెళ్లేందుకు నాలుగు ఫీట్ల రోడ్డును ఇవ్వడంతో పాటు వీడీసీ సభ్యులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.

కరీంనగర్ కార్పొరేటర్ కుల ధ్రువీకరణ పత్రం రద్దు

కరీంనగర్ టౌన్, జనవరి 19: నగరపాలక సంస్థ 6వ డివిజన్ కార్పొరేటర్ కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి (మున్నూరు కాపు) కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. 6వ డివిజన్ బీసీలకు కేటాయించగా కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి మున్నూరు కాపు కులధ్రువీకరణ పత్రంతో 2020లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆమె రెడ్డి ఓసీ వర్గానికి చెందినవారని, ఆమె సమర్పించిన బీసీ కులధ్రు వీక రణపై విచారణ జరిపి రద్దు చేయాలని కోరుతూ సాధవేని వినయ్‌కుమార్ అనే న్యాయవాది 2020లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ డిస్ట్రిక్ట్ లెవల్ స్క్రూటినీ కమిటీకి మాలతి సంపత్‌రెడ్డి కులధ్రువీకరణ పత్రాన్ని పంపించి విచారణకు ఆదేశించారు. దీనిపై విచారించిన డిఎల్ఎస్‌సి మాలతి సమర్పించిన బీసీ డీ కులధ్రువీకరణ రద్దు చేసింది. దీనితో మాలతిసంపత్ కోర్టును ఆశ్రయించడంతో పాటు ప్రభుత్వానికి కూడా అప్పీలు చేసుకోవడంతో తిరిగి విచారణ జరిపారు. డిఎల్ఎస్‌సి ఇచ్చిన నివేదిక మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ 30రోజుల్లో అప్పీలు చేసుకోవాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చదరంగ పోటీలు ప్రారంభం

- 11 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు రాక
- 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు హాజరు


చెస్ ఆడుతున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: అఖిలభారత ఫిడె రేటింగ్ అండర్-1,600 చదరంగ పోటీలు జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ తొలిఎత్తువేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధస్సును పెంపొందించే క్రీడా చదరంగం అని అన్నారు. చిన్నారులు చదరంగా క్రీడను నేర్చుకోవడంతో వారికి జ్ఞాపక శక్తి పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా విద్యార్థులు చదువులో రాణిస్తారని, మంచి క్రమశిక్షణ అవడుతుందన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారిగా అండర్-1,600 ఫిడె చదరంగ పోటీలను కరీంనగర్ వైశ్యభవన్ వేదికగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారుడు విశ్వనాథ్ అకాడమీ కోచ్ అంతగిరి విశ్వనాథ్ మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రొత్సహించే ఉద్దేశ్యంతో జాతీయ, అంతర్జాతీయ చదరంగ క్రీడాపోటీలను ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల అభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో దేశంలోని 11 రాష్ట్రాలనుంచి 300 మంది చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు ఉన్నారని వివరించారు. మొదటిరోజు నిర్వహించిన 3 రౌండ్ల పోటీల్లో కన్నం విశ్వనాథ్, అరగొండ మోహన్, సి పవన్, బి మహేందర్, గౌరిచందర్ ముందంజలో ఉన్నారని, పోటీల ఆర్బిటర్ సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, అకాడమి కోచ్ కొప్పర్తి శివయ్య, కె జగన్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ

భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యం

● బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్న రైతులు ● సర్వే నిలిపివేసి వెనుదిరిగిన అధికారులు


మెడిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధు

మెట్‌పల్లి రూరల్, జనవరి 19: వ్యవసాయం చేసుకుంటూ ఉన్న భూములను తీసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ఆందోళనకు దిగారు. శుక్రవారం గ్రామ శివారులో అధికారులు సర్వే చేస్తుండగా విషయం తెలుసుకున్న వెల్లుల్ల, బండలింగాపూర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు సంఘటన స్థలానికి వచ్చి బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్నారు. విషయం తెలుసు కున్న మెట్‌పల్లి ఆర్డీవో మధు, తహసీల్దార్ శేఖర్ సంఘటన స్థలానికి వచ్చారు. భూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తాము విలువైన భూములను ఇవ్వమని గతంలోనే చెప్పామని రైతులు పేర్కొన్నారు. రహదారి కోసం భూములు తీసుకుంటే ఉన్న జీవనోపాధి కోల్పోయి పని లేక ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు భూ పరిధిని బట్టి నష్టపరిహారం నిర్ణయిస్తారని, భూ సర్వే చేయనివ్వాలని ఆర్డీవో కోరినా రైతులు వినకుండా సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక అధికా రులు సర్వేను నిలిపి వెనుదిరిగారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 7,105 మంది విద్యార్థులు

చొప్పదండి జనవరి 19: జాతీయ స్థాయిలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే జవహర్ నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, 7,105 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకరావాలని, అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

● 4 బ్లాకులలో..

నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏడు జిల్లాల పరిధిలోని 14 బ్లాకులలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు, జగిత్యాలలో 11, సిరిసిల్లలో 5, పెద్దపల్లిలో 5, జయశంకర్ భూపాలపల్లి పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో, సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో, హనుమకొండ పరిధిలోని ముల్కనూరులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యా ర్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే 9490395216, 9966759402, 988 5101327 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

'ఖని'లో సైబర్ నేరస్థుల పంజా

- ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలు ఖాళీ
- ఖాతాదారులకు సంబంధం లేకుండా బయట రాష్ట్రాల్లో డబ్బులు విత్‌డ్రా
- గోదావరిఖని వన్‌టౌన్‌లోనే 43కేసులు



కోల్‌సిటీ, జనవరి 19: గోదావరిఖనిలో సైబర్ నేరస్థులు పంజా విసురుతున్నారు. ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఖాతాదారులకు సంబంధం లేకుండానే, వారు ఎలాంటి ఫోన్ వాడకుండానే, లింకులు ఓపెన్ చేయకుండానే రోజుకు రూ.10వేల చొప్పున బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఖాళీ అవుతుంది. బయటి రాష్ట్రాల్లో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) ద్వారా బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేసి డబ్బులు విత్‌డ్రా చేసుకున్నట్టు మెసేజ్‌లు వస్తున్నాయి. బ్యాంకుల్లోకి వెళితే పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ కేంద్రంగా మినీ ఏటీఎంలలో డబ్బులు డ్రా అయినట్టు గుర్తించారు. బాధితులు అలర్ట్ అయ్యేలోగానే వారి ఖాతాల నుంచి మళ్లింపబడిన సొమ్మును సైబర్ నేరస్థులు డ్రా చేసుకుంటున్నారు. గోదావరిఖని పట్టణంలోనే రెండు నెలల వ్యవధిలో వందల సంఖ్యలో ఈ విధంగా అకౌంట్లను కొల్లగొడుతున్నారు. బాధితులు అలర్ట్ అయి సైబర్ పోర్టల్‌లో 1930 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేసి అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలా ఫ్రీజ్ అయినవే 43నమోదు అయ్యాయి. ఇక సొమ్ములు పోగొట్టుకున్నవి వందల సంఖ్యలో ఉంటున్నాయి.

● రంగంలోకి సైబర్ క్రైమ్

గోదావరిఖని పట్టణంలోనే ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్ అప్రమత్తమయ్యింది. దీనికి సంబంధించి విచారణ ప్రారంభించింది. గోదావరిఖనిలో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) సిస్టంతో డబ్బులు పోగొట్టుకున్న బాధితులంతా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా బయోమెట్రిక్ వేలిముద్రలు వేసిన వారే ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా కొనుగోలు, అమ్మకాలు చేసిన వారు, సాక్షులుగా ఉన్న వారు బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేశారు. వీరి డాటా హ్యాక్ కావడం కానీ, చోరీ జరగడం కానీ అయి ఉంటుందని భావిస్తున్నారు. ఈ దిశగా విచారణ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం తమ సైబర్ సెక్యూరిటీ సిస్టం పటిష్టమైందని, చోరీచేసే అవకాశాలు లేవంటూ పేర్కొంటున్నారు. దీంతో హైదరాబాద్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సంప్రదించే పనిలో ఉన్నారు.

గ్రూప్స్ శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, జనవరి 19: కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.in లో ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ కోసం డిగ్రీ అర్హత కలిగిన కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగయువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబవార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్ కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్ కార్డ్, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 0878-228686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనము కరీంనగర్ కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల విజయ్, ప్రదీప్‌కుమార్, సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గండ దీపంలో నూనె పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో కూడా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెటర్లు భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలి

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: జిల్లాలో క్రికెట్‌లో రాణించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని, భవిష్యత్‌లో జిల్లాకు చెందిన క్రికెటర్లు రంజీ, భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూనిటీ కప్ 2024, క్రికెట్ లీగ్ పోటీలు శుక్రవారం నాటికి క్వార్టర్స్ ఫైనల్ దశకు చేరుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం స్టేడియంలో జరిగిన మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏ, బీసీసీఐలను కోరనున్నట్లు తెలిపారు. క్రికెట్‌లో ఉన్న ఆసక్తిని బట్టి జిల్లాలో క్రికెట్ అకాడమీలను నెలకొల్పడానికి హెచ్‌సీఏ ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించిన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రికెటర్లను వెలుగులోకి తీసుకొస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ మ్యాచ్‌లు అత్యంత హోరాహోరీగా జరుగుతున్నాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు భారీ ప్రైజ్‌మనీని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, క్రికెట్ కోచ్ కన్నన్, నిర్వాహకులు సురేష్, మహర్షి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, జనవరి 19: మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో మతిస్థిమితం కోల్పోయి ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెర్లుమద్దికి చెందిన తోపెటి లక్ష్మి(55) మతి స్థిమితం కోల్పయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుమారుడు కార్తీక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపిరి ఆడక వ్యవసాయ కూలీ మృతి

వీణవంక, జనవరి 19: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన డుకిరె రాజు (32) అనే వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరి ఆడక శుక్రవారం మృతి చెందాడు. పోలీస్‌లు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమ్మత్‌నగర్‌కు చెందిన రాజు ఉధయం వరి నారు మోసేందుకు కూలీ పనికి వెళ్లాడు. నారు నెత్తిన పెట్టుకొని నడుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి వంశీకృష్ణ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెద్దపల్లిటౌన్, జనవరి 19: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో నిర్వహిస్తున్న వ్యభిచారం గృహంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. పట్టణానికి చెందిన ఓ మహిళ చీకురాయి రోడ్డులో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచార స్థావరం నిర్వహిస్తుందన్న పక్కా సమాచారంతో దాడి చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు మహిళలను సఖి కేంద్రానికి తరలించినట్లు, స్థావరం నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 19: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 61మంది రైతులు 538క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 1,080క్వింటాళ్ల పత్తిని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసింది.

14 నుంచి వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19: నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ సమీపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 14 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వుడుతల వెంకన్న ఒక ప్రకనటలో తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ప్రభుత్వ అధికారికంగా బ్రహోత్సవాలను గతంలో మాదిరిగా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించామని చెప్పారు. 14న అధ్యయనోత్సవాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 21వ తేదీ శోభాయాత్రతో ముగిస్తాయని తెలిపారు.

'బీసీ బంధు' అమలు చేసి కులవృత్తులను ఆదుకోవాలి

సుభాష్‌నగర్, జనవరి 19: బీసీ బంధు పథకాన్ని అమలు చేసి కులవృత్తుల ను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాయితోజు బ్రహ్మచారి కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలోని అణగారిన వర్గాల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధును తక్షణమే అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలును రాజకీయ కోణంలో చూడడం సరికాదన్నారు. గతంలో బీసీ బంధ కోసం ఎంతో మంది దరఖాస్తు చేశారన్నారు. కొంతమంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఒక్కొక్కరికి లక్ష రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఇంకా బీసీ బంధుకోసం దరఖాస్తు చేసుకున్నవారి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి వారికి ఆర్థిక సాయం చేయాలన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీ సంక్షేమ పథకాన్ని అమలు చేస్తే రాష్ట్రంలోని బీసీలంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఆయన వెంట పెంట శ్రీనివాస్ ఉన్నారు.

పారడైజ్ పాఠశాలలో వార్షిక స్పోర్ట్స్ మీట్



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 19: రేకుర్తిలోని పారడైజ్ పాఠశాలలో శుక్రవారం వార్షిక స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా అన్నిరంగాల్లో నైపుణ్యంగా తీర్చిదిద్దేందుకు భాషా, సాంస్కృతిక క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి వసంత, ఏవో కె శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను చెల్లించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 19: గత సంవత్సరం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల మూల్యాంకనం రెమ్యూనరేషన్ 20శాతాన్ని వెంటనే చెల్లించాలని తెలంగాణ లెక్చరర్ల ఫోరం కోరింది. ఈమేరకు శుక్రవారం టీఎల్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పోకల నాగయ్య ఆధ్వర్యంలో డీఐఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2024 ఇంటర్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరిలో, వార్షిక పరీక్షలు మార్చిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో గత సంవత్సరం రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెద్దిరాజు సత్యనారాయణరాజు, ముత్తోజు సదానందచారి, వి.మధూకర్, బొంగోని శంకర్, రాజ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

21న విశ్వబ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక

సుభాష్‌నగర్, జనవరి 19: విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 ఆదివారం విశ్వబ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయవేదిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వేములవాడ ద్రోణచారి, అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, ప్రధానకార్యదర్శి గజ్జెల హరిహరచారి తెలిపారు. కరీంనగర్‌లోని గోదాంగడ్డలోగల ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని విశ్వబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే 'గంగుల'కు సన్మానం

సుభాష్‌నగర్, జనవరి 19: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య శుక్రవారం సన్మానించారు. క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగవెల్లి రాజేశ్, నగర గౌరవాధ్యక్షుడు ఆవుదుర్తి లక్ష్మణ్‌కుమార్, నగర అధ్యక్షుడు జంపాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



కేశవపట్నంలో మాట్లాడుతున్న సీడీపీవో సబిత

శంకరపట్నం, జనవరి 19: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీడీపీవో సబిత అన్నారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం గ్రామంలోని జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో స్నేహిత ఫేస్-1 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్ల బారిన పడకుండా విద్యపైన దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు ఏ విధమైన సమస్యలు ఉన్న ఉపాధ్యాయులకు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్‌డీవో కృపారాణి, విద్యాధికారి మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, విలేజ్‌కో-ఆర్డినేటర్, మండల కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మల, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: మాచనపల్లి గ్రామంలోని యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు స్నేహిత గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై శుక్రవారం అధికారులు, ఉపాధ్యాయులు అవగాహనన కల్పించారు. విద్యార్థులకు సురక్షితమైన వాతవరణం కల్పించడం, స్వీయ రక్షణపై కీలకమైన జ్ఞానాన్ని అందించేందుకు కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.

చొప్పదండి: విద్యార్థులకు పౌష్టికాహారం, సెల్‌ఫోన్ వాడకంపై డీఆర్‌డీవో శ్రీలత అవగాహన కల్పించారు. మండలంలోని రుక్మాపూర్ కస్తూర్బా విద్యాలయం, మోడల్ స్కూల్లో శుక్రవారం స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్, కస్తూర్బా ప్రత్యేక అధికారి భార్గవి, ఏసీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ రమాదేవి, మెడికల్ ఆఫీసర్ రాజేశ్, ఏఎస్ఐ యూసుఫ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: టేకుర్తి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మునిగడప సత్యనారాయణచారి ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎంఈవో విడపు శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, మండల వైద్యాధికారి తులసిదాస్, ఏఈవో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందన

జమ్మికుంట రూరల్, జనవరి 19: భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన గంగాడి కృష్ణారెడ్డికి జమ్మికుంటకు చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు ఆయన నివాసంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఆయన వెంట నియోజక వర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సింహారాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు, పట్టణాల అధ్యక్షులు జీడి మల్లేష్, రామిడి ఆదిరెడ్డి, గంగిశెట్టి రాజు, పల్లపు రవి, భూపతి ప్రవీణ్, మోడమ్ రాజు ఉన్నారు.

సొంత ఖర్చుతో మసీదు నిర్మించిన సర్పంచ్

తిమ్మాపూర్, జనవరి19: మండలంలోని నర్సింగాపూర్‌లో సర్పంచ్ తోట మమత మధు తన సొంత ఖర్చుతో ముస్లింల కోసం మసీదు నిర్మాణం చేసి శుక్రవారం ప్రారంభించారు. మసీదు నిర్మాణానికి 3లక్షల 70వేల రూపాయలు ఖర్చు అయ్యాయి. అందులో సర్పంచ్ తోట మమత మధు సొం తంగా 2.70లక్షల రూపాయలు వెచ్చించారు. మైనార్టీ కమిటీ తమ వంతుగా లక్ష రూపాయలు అందించినట్లు సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ తోట మమత మధుకు మైనార్టీ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్యకు యువకుల సైకిల్ యాత్ర





తన ఇంటిపై జైశ్రీరాం వాల్ పెయింట్ రాస్తున్న బండి సంజయ్, మాట్లాడుతున్న వీహెచ్‌పీ బాధ్యులు

భగత్‌నగర్, జనవరి 19: కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన యువకులు అయోధ్యకు సైకిల్ యాత్రగా వెళ్తుండగా ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ యాత్రను శుక్రవారం ప్రారంభించారు. మంగ వంశీకృష్ణ, ఆదిత్య ఇద్దరు యువకులు అయోధ్యకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ నెల 22 అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో మంచు కురిసే అవకాశమున్నందున జాగ్రత్తగా వెళ్లాలని, వీలైనంత వరకు పగటిపూట యాత్ర కొనసాగించాలని సూచించారు.

● జైశ్రీరాం వాల్ రైటింగ్..

ఈనెల 22న అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్నందున బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన ఇంటి గోడపై స్వయంగా జైశ్రీరాం అంటు వాల్‌రైటింగ్ రాసుకున్నారు. రాష్ట్రమంతా జైశ్రీరాం నినాదాలతో మారుమోగుతుందన్నారు. కరీంనగర్‌లో రాజకీయపార్టీలకు అతీతంగా తమ ఇళ్లపై జైశ్రీరాం వాల్ రైటింగ్ రాయించుకుంటున్నారన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలి..

కరీంనగర్ కల్చరల్: ఈ నెల 22న అయోధ్యలో మధ్యాహ్న సమయంలో జరిగే బాల రాముని ప్రతిష్ఠా వేడుకలను జిల్లా అంతటా ఘనంగా నిర్వహించుకోవాలని విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ప్రముఖ్ కోమాళ్ల రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సుభాష్‌నగర్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఎనుగుర్తి రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 500 సంవత్సరాల్లో లక్షల మంది ప్రాణత్యాగం, 35 సంవత్సరాల వీహెచ్‌పీ ఉద్యమం కారణంగా ప్రతిష్ఠ జరుగుతుందని అన్నారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఈ నెల 22న సమీప ఆలయాల్లో భజనలు, పారాయణాలు, పూజలు జరపాలని, సాయంత్రం ఇళ్లలో కనీసం ఐదు దీపాలు వెలిగించాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, విభాగ్ గోరక్షా ప్రముఖ్ వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, పట్టణ కార్యదర్శి మనోజ్‌లాహోటి, జిల్లా సహ కార్యదర్శి జగదీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● 22న సెలవు ప్రకటించాలి..

భగత్‌నగర్: అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న జిల్లాలో సెలవు ప్రకటించాలని కోరుతూ తపస్ నాయకులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో పవన్‌కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్ అన్నమనేని తిరుపతిరావు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు సంపత్‌కుమార్, శశిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ద్యావనపల్లి శ్రీకాంత్, కె సత్యం, శంకరయ్య, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

22న అక్షింతలు, ఫొటోల పంపిణీ..

కరీంనగర్ కల్చరల్: అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మళయాళ సద్గురు గీతా మందిరంలో అక్షింతలు, ఫొటోలు అందజేయనున్నారు. సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు విష్ణుసేవానందగిరిస్వామి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఆంజనేయసేవాసమితి, భజనమండలి బాధ్యులు కొండమీది తిరుపతిస్వామి, వర్మ, శ్రీనివాస్, అనిల్‌కుమార్, రాము, రాజు, సత్యనారాయణ, లింగమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ సిటి పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి

భగత్‌నగర్, జనవరి 19: కరీంనగర్‌లో స్మార్ట్ సిటి పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంతో పాటు నగర శివారు గ్రామాల్లోభూములు కబ్జాలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వారిని అరెస్టు చేయడం సంతోషకరమన్నారు. నగరపాలక సంస్థలో డీజిల్ కుంభకోణంపై విచారణ చేపట్టి, భూకబ్జాలకు పాల్పడినవారు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా అరెస్టుచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

బస్ షెల్టర్ పునరుద్ధరణ

కరీంనగర్‌రూరల్, జనవరి 19: కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్‌లోని బస్‌షెల్టర్‌ను అధికారులు, గ్రామస్థులు శుక్రవారం పునరుద్ధరించారు. సర్పంచ్, గ్రామస్థుల వినతుల మేరకు బస్టాండ్ వద్ద ఉన్న పాన్ టేలాను తొలగించాలని అధికారులు నిర్ణయించారు. మహాలక్ష్మి స్కీంతో బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్‌షెల్టర్‌ను పునరుద్ధరించాలన్నారు. పాన్ టేలాను తొలగించాలని లేఖను సర్పంచ్, గ్రామస్థులకు ఆర్టీసీ అధికారులు అందించారు. ఎక్స్‌ప్రెస్ బస్సులను మొగ్దుంపూర్ స్టేజి వద్ద ఆపుతున్న డ్రైవర్లు, కండక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు జక్కం నర్సయ్య, ఎల్లారెడ్డి, షైలారంనాగరాజు,లచ్చిరెడ్డి, పాల్గొన్నారు.

'అల్ఫోర్స్' పూర్వ విద్యార్థినికి రిజర్వు బ్యాంకులో ఉద్యోగం



అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 19: అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి ముత్యాల మాధురి రిజర్వు బ్యాంకులో ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. శుక్రవారం కళాశాల ఆవరణలో విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, జి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం అందించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రయ్య

సుభాష్‌నగర్, జనవరి 19: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపెట్టిన బాధితులకు ప్రభుత్వ పరంగా అందించే ఆర్థిక సహాయం అందించాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి చంద్రయ్య కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిన బాధితులను పోలీసు అధికారులు కేసు విరమించుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రాజకీయ నాయకులు సైతం ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో కేసు నీరుగారే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేసు ఎఫ్ఐఆర్ అయిన వెంటనే బాధితులకు ప్రభుత్వపరంగా అందించే ఆర్థిక సహాయం అందించేందుకు కలెక్టర్ ప్రత్యేకచొరవ చూపాలని కోరారు. సమావేశంలో చెల్పూరి రాంమూర్తి, దుబ్బాసి ప్రణీత్, లంకెల అనిల్, సిగిర శ్రీధర్, ఉట్ల బాపురెడ్డి, తర్ర నర్సయ్య, బడుగు లింగం, లంక లక్ష్మణ్, పుల్యాల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి రమేష్

భగత్‌నగర్, జనవరి 19: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మిక, కర్షకులు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెనక్కి తీసుకువచ్చి ప్రతీ ఒక్కరికి 15 లక్షలు బ్యాంక్ అకౌంట్‌లో వేస్తామని గద్దెనెక్కిన మోదీ నిరుద్యోగాన్ని యాభై సంవత్సరాల వెనక్కినెట్టిందన్నారు. పెట్రోల్ ఉత్పత్తులపై 243 శాతం పన్నుల వాటాను పెంచారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానం ద్వారా 100 శాతం అమ్మకానికి పెట్టారన్నారు. లేబర్‌కోడ్‌ల ద్వారా కార్మిక హక్కులనుపూర్తిగా హరించివేశారన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక అంశాలపై ఇంటింటికి ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, వర్ణవెంకట్‌రెడ్డి, కప్పంపల్లి అజయ్, మిల్కూరి వాసుదేవరెడ్డి, ఎడ్ల రమేష్, యు శ్రీనివాస్, గుడికందుల సత్యం, జనగం రాజమల్లు, పున్నం రవి, మారెళ్ల శ్రీలత, కదిరే రమేష్, పిల్లి రవి, రాయికంటి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, పాల్గొన్నారు

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● కనబడని క్రీడా కిట్లు ● లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం



అన్నారంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

మానకొండూర్, జనవరి 19: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలనే భావనతో ప్రతి గ్రామంలో లక్షల రూపాలయలను వెచ్చించి నిర్మించిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. అధికారులు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మండలంలో 27 గ్రామపంచాయితీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక అక్కడ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26 గ్రామాలలో ఒక్కొక్క దానికి 2లక్షల రూపాయలు ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లించారు. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బారు, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడా ప్రాంగణం ఊరికి దూరంగా సుమారు 4కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో దాన్ని స్థానికులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. . ప్రతి గ్రామానికి 16 రకాల ఆట వస్తువులు కల్గిన క్రీడా కిట్లను అధికారులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పంపిణీ చేసిన కిట్లు మూలనపడడంతో యువత క్రీడా ప్రాంగణాలను దూరమయ్యారు. దీంతో క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారడంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

మానకొండూర్, జనవరి 19: నియోజకవర్గంలో నూతన ఓటరు నమోదు కార్యక్రమంపై రెండు రోజుల ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మానకొండూర్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఆదేశాల మేరకు శని, ఆదివారం నియోజకవర్గంలోని 316 పోలింగ్ బూతులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ప్రత్యేక శిబిరాలలో నూతన ఓటరు నమోదు, మృతి చెందిన వారిని తొలగింపు, ఓటరు లిస్టులో తప్పొప్పుల సవరణ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూతులలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ఓటరు మహాశయులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తిమ్మాపూర్: నూతన ఓటరు నమోదుకు శని, ఆదివారం రోజుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించను న్నామని తహసీల్దార్ కనకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 57 పోలింగ్ బూతులలో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి సాయం త్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారని, 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిమ్మాపూర్, జనవరి 19: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో శుక్రవారం టీఎస్‌జీవోస్ తిమ్మాపూర్, గన్నేరువరం యూనిట్ క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పోలు కిషన్, అంబటి నాగరాజు, రాష్ట్ర, జిల్లా నాయకులు హరికిషన్, రాగి శ్రీను, వొంటెల రవీందర్‌రెడ్డి, పుప్పాల ఆశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు వాకర్స్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

హుజూరాబాద్, జనవరి 19: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హైస్కూల్ గ్రౌండ్‌లో హుజూరాబాద్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు వేముల గోవర్ధన్, సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి వాకింగ్, రన్నింగ్, షాట్‌పుట్ తదితర క్రీడలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించనున్నామని, వాకర్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న కరీంనగర్ నాబార్డు డీడీఎమ్ జయప్రకాశ్

జమ్మికుంట, జనవరి 19: చిరు ధాన్యాలతో ఆహార ఉత్పత్తులు తయారి చేస్తూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని కరీంనగర్ నాబార్డు డీడీఎమ్ జయప్రకాశ్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శుక్రవారం నాబార్డు సౌజన్యంతో మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద చిరుధాన్యాలు-విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు 15రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయప్రకాశ్ మాట్లాడుతూ చిరు ధాన్యాల తయారి, మార్కెట్‌లో బ్రాండింగ్, లేబులింగ్ ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. తమిళనాడు రాష్ట్రంలో ప్రస్తుతం మహిళలు ఏ విధంగా ఉపాధి పొందుతూ ఆర్థిక స్వాలంబన పొందుతున్నారో అవగాహన కల్పించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ మహిళలు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎ ప్రశాంతి మాట్లాడుతూ ఫుడ్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయడానికి కావాల్సిన రుణాలు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్పందన ఎన్‌జీవో ఏ శోభారాణి, జమ్మికుంట, వీణవంక, హుజూరాబాద్, గంగాధర మండలాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

కరీంనగర్ టౌన్, జనవరి 19: నగరంలోని ఈస్ట్‌జోన్ పరిధిలోని ఆరో డివిజన్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని బొమ్మకల్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు వి ఆనంద్‌కుమార్, సాయిప్రసాద్, రవీందర్, అంజలి, నేషనల్ బ్యాంకు మేనేజర్ వీరేశం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్, నాయకులు దుబాల శ్రీనివాస్, అవుదూర్తి శ్రీనివాస్, కుంటల మధు, పోరెడ్డి శ్రీధర్, గూడెపు ఉమా మహేశ్ పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కరీంనగర్ టౌన్, జనవరి 19: నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ , మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ హాజరవుతారని తెలిపారు. పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టెక్నీషియన్ వసూళ్లపై ఫిర్యాదు

సుభాష్‌నగర్, జనవరి 19: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ సదరన్ సర్టిఫికెట్ కోసం 15వేల రూపాయల వసూళ్లకు పాల్పడటంపై ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సదరు టెక్నీషియన్‌పై వచ్చిన ఆరోపణపై వివరణ కోరేందుకు సూపరింటెండెంట్ ప్రయత్నించగా ఆయనతో ఇష్టానుసారంగా మాట్లాడటమే కాకుండా తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడటం ఆసుపత్రిలో కలకలం రేపింది. వివరణ ఇవ్వాల్సిన ఉద్యోగి బెదిరింపులకు పాల్పడటం, దుర్భాషలాడడంపై సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సదరం శిబిరాన్ని ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నిర్వహించాలని సూపరింటెండెంట్ పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారి ప్రవర్తన మార్చుకోకపోవడమే కాకుండా దుర్భాషలాడడంపై వైద్యులు, సిబ్బంది సీరియస్‌గా తీసుకున్నారు. దీనితో సూపరింటెండెంట్ చర్యలకు ఉపక్రమించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, జనవరి 19: ప్రతిమ హాస్పిటల్, లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె వెంకటేష్ ఒక ప్రకటలో తెలిపారు. స్థానిక భగత్‌నగర్‌లోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూలులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలు, రుమటాయిడ్ ఆర్థరైటీస్(కీళ్లనొప్పులు), కడుపు ఉబ్బరం, లివర్ సంబంధిత వ్యాధులు, అన్ని రకాల వ్యాధులకు ఈ వైద్యశిబిరంలో స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసీజీ, టుడీ ఇకో, ఆర్‌బీఎస్, బీపీ, స్పిరోమెట్రీ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య సేవల కోసం నగునూరు లోగల ప్రతిమ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 94411 64416, 80745 51172 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు ప్రశ్నను మింగిన కాలం పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జనవరి 19: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9-30 గంటలకు విద్యుత్ ఇంజనీర్ల భవనంలో పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం' పుస్తకావిష్కరణ ఉంటుందని అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరణ చేయనున్నారని కవులు, రచయితలు హాజరు కావాలని కోరారు.

సర్పంచ్‌ల పదవీ కాలం పొడిగించాలి

గంగాధర, జనవరి 19: సర్పంచ్‌ల పదవి కాలం పొడిగించాలని శుక్రవారం ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రకు గంగాధర మండల సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు.. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కరోనా సమయంలో చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో నష్టపోయామని చెప్పారు. పెండింగ్ బిల్లులు విడుదల చేస్తూ ప్రత్యేకాధికారులుగా సర్పంచ్‌లను కొనసాగించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మేఘరాజు, దామోదర్, నవీన్‌రావు, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

గంగాధర, జనవరి 19: లోవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో మోటర్లు కాలిపోతున్నాయని, సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాచిరెడ్డిపల్లి రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు శుక్రవారం వినతి పత్రం అందించారు. గ్రామంలోని 16కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌తో తరుచూ లోవోల్టేజీతో వ్యవసాయ పంపు మోటర్లు కాలిపోతున్నాయని చెప్పారు. 25 కేవీకి పెంచి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని కోరారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

గంగాధర, జనవరి 19: గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏఆర్ అకాడమీ యాజమానులు పెన్నులు, పరీక్ష ప్యాడ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రమీల విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ గాంధీ, నెహ్రూల త్యాగాలను గుర్తు చేస్తూ వారి బాటలో నడవాలని సూచించారు. లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని చెప్పారు. కార్యక్రమంలో గంగాధర నెహ్రూ యువ కేంద్రం అధ్యక్షుడు ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జమ్మికుంట, జనవరి 19: జమ్మికుంట మాజీ ఉప సర్పంచ్ పొనగంటి శంకరయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో శుక్రవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడద్దని అండగా ఉంటానని భరోసా కల్పించారు.

మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త మృతి



చొప్పదండి/సైదాపూర్, జనవరి 19: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త బొడిగె గాలన్న శుక్రవారం మృతి చెందారు. గాలన్న గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. గాలన్న మృతికి మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ సంతాపం తెలిపారు. కాగా సైదాపూర్ మండలం వేంకటేశ్వర్లపల్లిలో గాలన్న మాదిగ అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.